# విముక్తి

రచన:
శ్రీ వై. వి. రాజారావు.

ఉన్నట్టుండి మహా ఆలోచనలో పడిపోయాడు వెంకటపతి.

ఆ రోజు 30 వ తేదీ. తెల్లవారితే 1 వ తేదీ. అంటె జీతాలరోజు. 1 వ తేదీ వస్తే జీతం వస్తుందనె సంతోషం కూ 1 వ తేదీకి కూడా వుండదు. దానికి బదులుగా 1 వ తేదీ వస్తోందంటే మహాభయం వెంకటపతికి. అసలీ 1 వ తేదీ యెందుకు వస్తుందో, రాకుండా వుంటేనే బాగుండుందను కొంటాడు. కానీ వెంకటపతికోసం 1 వ తేదీ రాకుండా మానదుగా మరి. అట్లాగే 1 వ తేదీ ప్రతి నెలా రానే వస్తోంది. పోతోంది కూడా కానీ, అన్ని 1 వ తేదీల లాగా కాకుండా, ఈ 1 వ తేదీకి యేదో ప్రత్యేకత వుంది. అదే విశేషం.

అప్పుడు సుమారు రాత్రి 11 గంటలవుతోంటుంది. అయినా పక్కమీద పడుకొన్న వెంకటపతికి నిద్రపట్ట లేదు. అవును మరి! ఎలా పడుతుంది? తెల్లవారితే అప్పుల వాళ్ళందరికీ యెలా సర్దాలా అనే ఆలోచనె వేధిస్తోంది. ఆ వచ్చె నాలుగు డబ్బులు, తీర్చవలసిన అప్పులముందు యెంతమాత్రం చాలనె చాలదాయె. ఏమిటి చేయటం అన్నదె ఆలోచన. ఆ ఆలోచనలకి అంతే లేదేమొ మరి.

తెల్లవారి యే 10 గంటలకో జీతం యిస్తారనగా 9 గంటలకె రెసీతో బుక్ టో యింటిబాడుగ కోసం, యింటి యజమాని పంపిన మనిషి రెడీగా వుంటాడు ఆఫీసువద్ద. 3 గంటలకు కాఫీకోసమని హోటల్ వెళితే, అయ్యరు బుక్కు తనముందు విసురుతాడు టోటల్ వేసి డబ్బివ్వమంటూ కలెక్టర్ ఆఫీస్ బిల్డింగ్ దిగి సైకిల్ స్టాండు తీసి సైకలెక్కె లోపుగా మార్వాడీవాడు హాజరయి వుంటాడు తన కివ్వవలసిన నెలవడ్డీ 20 రూ. లు యివ్వమంటూ ఇంటికి వచ్చేదారిలోనె, శెట్టి రంగనాథం యిల్లు. తన స్వంత యింటిని కుదువబెట్టుకొని, 4,000 అప్పుగా తన చెల్లెలు పెళ్ళికోసం యిచ్చినందుకు గాను వడ్డీ యివ్వమని అడిగే విషయం జ్ఞాపకం లేకపోలేదు. ఇహ పోతే మరుసటిరోజు, పాలు, పెరుగు కూరగాయల మనిషికి, తప్పకుండా యిచ్చి తీరవలసిందె. ఏదీ తప్పదు.

ఇక పోయిన నెలలో భార్య సిక్ పడినప్పుడు యివ్వవలసిన డాక్టరు బిల్లు యివ్వలేదు కాబట్టి, అదీ కూడా ఈ నెలకె వచ్చిపడింది. సంవత్సరం క్రితం మార్వాడీ షాపులో కుదువపెట్టిన నెక్లెస్ విడిపించుకో లేదు కాబట్టి దానికి టైమ్ బార్ అయిపోయిందని 2 వ తేదీ వేలం వేస్తామని రిజిష్టర్డ్ నోటీసు పంపించాడు వాడు.

ఇంటిలో 2 నెలలుగా డబ్బుపంపటం లేనందున మేము పస్తులు పడుతున్నాము. వెంటనే కం రూ. లు పంపితె సరె, లేకపోతె ప్రాణాలు దక్కవు అంటూ అమ్మ వ్రాశిన జాబు వెక్కిరించ సాగింది వెంకటపతిని. కట్టవలసిన బాకీలు యిన్ని వుండగా జీతం కట్స్ పోను 40 చేతికివస్తే, యెవరికివ్వాలి యెవరికి మానావి అన్నదె ప్రస్తుతం సమస్య. ఇవి వెంకట పతికి క్రొత్తవి కావు. ఎన్నో నెలలుగా నెల నెలకు యెదురౌతున్నవె. పాత అప్పులు తీర్చటంకోసం క్రొత్త అప్పులు చేయాల్సివచ్చేది పాపం. పాత అప్పులు తీరిన తీరకపోయినా, పాతవి, క్రొత్తది చేరి మళ్ళీ పర్పస్‌లాగా రెట్టింపయ్యేవి. ఈ అప్పుల బాధనుండీ విముక్తి యెలా సాధించాలన్నదె ఆలోచన దానికి వోమార్గం ఆలోచించటం కోసమె ఈ ఆలోచనలన్నీ.

ఆ మాటకి వస్తే వెంకటపతి పూర్తిగా బికారిమాత్రం కాదు. తన స్వంతవూరిలో 4 ఎకరాలభూమి, 10 సెంట్ల స్థలం వున్నాయి. 10 సంవత్సరాల క్రితమె వుద్యోగ రీత్యా స్వంతవూరు వదలి యింతదూరం వచ్చి యిక్కడ సెటిల్ కావటంవల్ల మళ్ళీ స్వంత వూరికి వెళ్ళే అవుసరం యేర్పడ లేదు వెంకటపతికి. ఆ ఆస్తి అన్ని యేళ్ళగా వుండి పోయింది.

పోనీ ఆ ఆస్తి కాస్తా అమ్మి అప్పులు తీర్చవచ్చుకదా అన్న ఆ యిడియా రాకపోలేదు కానీ దానికి వున్నది వొకే వొక చిక్కు. అదే ఆ, ఆస్తి, అతడికి, అతడి మామకు జాయింట్‌గా వుండటమె. ఆయన, ఢిల్లీనుంచి రానిదె ఆ ఆస్తి అమ్మడం కుదరదు. అది అమ్మితెగానీ అతడి దారిద్రం తీరి మంచిరోజులు రావు, ఆ పని, వాళ్ళ మామ రిటైరై డిల్లీనుంచీ తన స్వంత వూరు వచ్చేవరకు కుదరదు. ఆ విషయమె వ్రాశాడు వాళ్ళ మామ, తను ఆ ఆస్తి విషయమై జాబు మామకు ఢిల్లీకి వ్రాస్తే.

ఇంతలో వెంకటపతికి కాస్తా కునుకుపట్టి నట్టనిపించింది. అంటె దాంతో, వెంకటపతి ఆలోచనలకి సడన్ బ్రేక్ పడింది.

* * *

ఎలాగైతేనేం వెంకటపతి ఆలోచనలు ఫలించాయి. అతడి ఆస్తి అమ్ముడు పోయింది. 11000/- రూ. లు క్యాష్ చేతికి వచ్చింది. దాంతో వెంకటపతి దారిద్ర్యం తీరిపోయింది, రెండు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి స్వంత వూరికి పోయి పని మొగించుకొని వచ్చాడు,

(తరువాయి 16వ పేజీలో)

(13వ పేజీ తరువాయి)


క్యాష్ చేతికి వస్తూనే వెంకటపతి చేసిన మొదటిపని, మార్వాడీ వాడి అప్పు తీర్చి బాండ్ వెనక్కు తీసుక రావడం, రెండవది, రంగనాథం శెట్టికి తన యింటిపైన తెచ్చిన అప్పు వడ్డీతో సహా తీర్చేసి, యిప్పుడు బాకీ లేదనిపించుకోవడం, అన్నట్టు మరుసటిరోజే బాడుగ యిల్లు ఖాళీచేసి యిల్లుకొని మకాం స్వంతయింటికి మార్చాలని ముందుగా యేర్పాటు చేసుకొన్నాడు మళ్లీ ఇప్పుడు వెంటపతికి చిల్లర అప్పులు కూడా యేమీ లేవు. అన్నీ తీర్చి ఋణవిముక్త డయ్యాడు. ఇప్పుడు అతడికి వచ్చే జీతం చాలడం లేదని అనిపించడం లేదు.

అంతే కాదు. వెంకటపతి యిప్పుడు చిన్న కాపిటల్‌తో వో సైడ్ బిజినెస్ చేస్తున్నాడు కూడా. అదృష్టం కలిసివచ్చిందేమొ త్వరలోనే పైకివచ్చాడు, బిసినెస్‌లో వెంకటపతి. ఇప్పుడు ప్రతిరోజూ ఆఫీసుకి వెళ్ళటం రావటం స్కూటరుపైన్నే. అవును మరి జాతకం మారిందిగా యిప్పుడు! అన్నట్టు అతడి తల్లి తండ్రులకు యిప్పుడు యెలాంటి కష్టాలు లేవు అతడితోనే వుండుమని ఇంటికి పిలుచుకొని వచ్చాడు. ఇప్పుడు అందరూ కలిసే వుంటున్నారు యే దిగులులేకుండా. ఇప్పుడు వెంకటపతికి మార్వాడీ వాడి భయం కానీ, శెట్టి రంగనాథం వడ్డీ భయం కానీ లేవు. ఇంటివాడి పీడ అంతకన్నా లేదు. అన్నీ అశ్వాలనుంచీ విముక్తి లభించింది అంతే కాదు యిప్పుడు 40, 50. యెవరైనా కావాలంటే ఆఫీసులో వెంకటపతే, యివ్వ సాగాడు. అంచేత వెంకటపతిని చూస్తే యిప్పుడందరికీ వో విధమైన గౌరవం అభిమానం యేర్పడ్డాయి.

వెంకటపతికి యిప్పుడు యెలాంటి చీకు చింత లేవు. హాయిగా శ్వాస పీలుస్తూ జీవితం గడుప సాగాడు. ఇప్పుడతడికి అలాంటి ఆలోచనలు లేవు. జీవితం యెంతో మధురాతి మధురంగా సాగిపోతోంది. కలల్లో!

* * * *

అంతె! తెల్లవారింది. ఆ రోజే 1వ తేదీ! ముందురోజు రాత్రి పక్కపైన పడుకొని ఆలోచనతో కళ్ళుమూసిన వెంకటపతి, మరి కళ్ళు తెరవనే లేదు. అంటె ఎడతెగని ఆలోచనలతో, చాలా వీక్‌గా వుండిన వెంకటపతి హార్టు, పని చేయనంటూ టక్‌మని ఆగిపోయింది పాపం. దానికి అతడు మాత్రం యేం చేస్తాడు? ఆ తప్పు అతడిది కూడా కాదు. అంటె! తెల్లవారింది. రావలసిన 1వ తేదీ కూడా రానే వచ్చింది! కానీ అన్ని బాకీల నుంచి వెంకటపతికి విముక్తి లభించింది!




## 'సుగుణ సుందరి కథ'

శ్రీ పింజల సుబ్బారావు, పి. ఎస్. ఆర్. పిక్చర్స్ బ్యానర్ క్రింద తయారించే 'సుగుణ సుందరికథ' చిత్రం తాల్లూకు షూటింగ్ ప్రారంభమైనది. ఇందులో, కాంతారావు, రామకృష్ణ, సత్యనారాయణ, త్యాగరాజు, మిక్కిలినేని, విజయలలిత, దేవిక, జ్యోతిలక్ష్మి, పుష్పకుమారి మొదలగువారు నటిస్తున్నారు.

ఛాయా_దర్శకుడు, హెచ్. ఎస్. వేణు. సంగీతం :_ ఎస్. పి. కోదండపాణి, రచన :_చిల్లర భావనారాయణ. గీతాలు :_నారాయణ రెడ్డి, కొసరాజు, ఆరుద్ర. సహదర్శకుడు :_కె. ఎస్. రావు.

♦ ♦ ♦ ♦

## 'భక్త తుకారాం'

'కథానాయిక మొల్ల' ద్వారా భక్తిరస చిత్రం తీసి అఖండ ఖ్యాతి గడించిన శ్రీ పద్మనాభం, ఈసారికూడా, మరొక భక్తికథ అయిన 'భక్తతుకారాం' చిత్రాన్ని తయారిస్తారు. ఇందులో పేరొందిన నటీనటులంతా పాల్గొంటారు. వివరములు ముస్ముందు తెలిపరుస్తాం.

* * * *

## 'విజయం మనదే'

రాజేంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి 'విజయం మనదే' చిత్రం, ఈనెల 15వ తేదీ ఆంధ్ర ప్రదేశ మంతటా విడుదల అవుతుంది. ఈ చిత్రంలో, ఎన్. టి. రామారావు, మిక్కిలినేని, సత్యనారాయణ, బాలకృష్ణ, గుంటూరు వెంకటేష్, దేవిక, శాంతకుమారి, బి. సరోజాదేవి, మీనాకుమారి మొదలగువారు నటించారు.

సంగీతం :_ఘంటసాల. రచన:_వీటూరి. కళ :_కుదరవల్లి నాగేశ్వరరావు. దర్శకత్వం:_శ్రీ బి. విఠలాచార్య, నిర్మాత:_శ్రీ నందమూరి సాంబశివరావు.